

సర్కారు బడి.. చదువులమ్మ ఒడి

పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

- 8లో



ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించారు.

- 8లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో పెద్దసంఖ్యలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు.

- 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల పరిశీలకుడికి స్వాగతం



అమ్రిత్‌రాజ్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా నియమితులై, చిత్తూరుకు వచ్చిన అమ్రిత్‌రాజ్‌కు ఎస్పీ మణికంఠ స్వాగతం పలికారు. బుధవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో అమ్రిత్‌రాజ్‌ను కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఎస్పీతో అమ్రిత్‌రాజ్ చర్చించారు.

27న సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 27వ తేదీన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటేశులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ రథోత్సవం, 10 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు గణపతి వ్రతం జరిపించనున్నట్లు వివరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నిబంధనలు బేఖాతర్!



నామినేషన్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ నాయకులు ఎన్నికల నిబంధనలను యథేచ్ఛగా బేఖాత్ చేస్తున్నారు. బుధవారం చిత్తూరు ఎంపీ, అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థులు దగుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్‌మోహన్ నామినేషన్లు దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌కు విచ్చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల తర్వాత అభ్యర్థితో పాటు నలుగురు ప్రతిపాదకులకు మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే టీడీపీ నాయకులు 10 నుంచి 15 మంది పరిధిని దాటి ప్రవేశించి కోడ్‌ను అతిక్రమించారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు మీడియాతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వైఎస్సార్‌సీపీని దూషించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసుల సైతం చోద్యం చూస్తూ ఉండిపోవడం గమనార్హం.

జయం మనదే

"చంద్రబాబు మాయమాటలకు కాలం చెల్లింది.. కుప్పం ప్రజలకు వాస్తవం అర్థమైంది.. 35 ఏళ్ల మోసంపై అవగాహన వచ్చింది.. అందుకే సంక్షేమ సుపరిపాలనకు ప్రజానీకం జైకొడుతోంది.. ఇచ్చిన మాట నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు పలుకుతోంది.. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను ప్రభంజనం కొనసాగనుంది.. కుప్పం కోటపై వైఎస్సార్‌సీపీ జెండా సగర్వంగా ఎగరనుంది" అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి తరలి వచ్చిన అశేష జనసందోహాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

- కుప్పంలోనూ గెలుపు తథ్యం
- భరత్ మంత్రి కావడం ఖాయం
- చంద్రబాబు ఆటలు ఇక సాగవు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ నామినేషన్‌కు పోటెత్తిన జనం



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి అశేషంగా తరలివచ్చిన ప్రజలు



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్

కుప్పం: సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలోనూ విజయం మనదే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం వైఎస్సార్ సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణరాఘవ జయేంద్ర భరత్ నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ 35 ఏళ్లుగా మాయమాటలతో చంద్రబాబు కుప్పం ప్రజలు మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జనం మేలుకున్నారని ఇక బాబు ఆటలు సాగవన్నారు. సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ క్రమంలో కుప్పంలోను వైఎస్సార్ సీపీ విజయం సాధించడం తథ్యమని, భరత్ మంత్రి కావడం ఖాయమని వెల్లడించారు. కుప్పం చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ర్యాలీకి హాజరైన జనాలను చూస్తే చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెత్తుతాయని తెలిపారు. చంద్రబాబుకు మాట్లాడేందుకు ఏమీ లేక, ఉమ్మడి జిల్లాలో ఎక్కడికి వచ్చినా తనపై విద్వేష పూరిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మే 13న పోలింగ్ నాడు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో చిత్తూరు పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తున్నానని, ఆశీర్వదించాలని కోరారు.



సమష్టి కృషితో జెండా ఎగురవేస్తామంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్



కుటుంబసమేతంగా నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

మీ బిడ్డను ఆదరించండి..

ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ మాట్లాడుతూ ఐదేళ్లుగా మీ అందరి మధ్యన మీ బిడ్డగా తిరుగుతూ, మీ బాగోగులు చూస్తున్న తనను మీ కుటుంబ సభ్యునిగా గుర్తించి ఆదరించాలని విన్నవించారు. నామినేషన్ ర్యాలీకి పిలుపు ఇవ్వగానే నియోజక వర్గం నలుమూలల నుంచి తండోప తండాలుగా తరలివచ్చిన ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రేమ, మంత్రి పెద్దిరెడ్డి, తనపై అభిమానంతో వచ్చిన జనాలను చూసి టీడీపీ వారు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. చంద్రబాబుకు మే 13న ఇదే జనం ఓటుతో దిమ్మ తిరిగేలా జవాబు ఇస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, రెస్కో చైర్మన్ సెంథిల్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆరో రోజు 63 నామినేషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం ఆరో రోజు 49 మంది అభ్యర్థులు 63 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నగరిలో మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా మూడో సెట్ నామినేషన్ వేశారు. అలాగే కుప్పంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ నామినేషన్ సమర్పించారు. ఈ క్రమంలోనే కలెక్టరేట్‌లో చిత్తూరు పార్లమెంట్‌కు 8 మంది అభ్యర్థులు నామినేషన్‌లను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్‌కు అందజేశారు. అలాగే పుంగనూరు అసెంబ్లీకి ఏడుగురు అభ్యర్థులు 8 సెట్లు, నగరిలో 9 మంది అభ్యర్థులు 9 సెట్లు, జీడీనెల్లూరులో 9 మంది అభ్యర్థులు 12 సెట్లు, చిత్తూరులో 10 మంది అభ్యర్థులు 11 సెట్లు, పూతలపట్టులో 5 మంది 5సెట్లు, పలమనేరులో ఇద్దరు అభ్యర్థులు 3 సెట్లు, కుప్పంలో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నేడే ఆఖరి రోజు జిల్లా వ్యాప్తంగా నామినేషన్‌ల ఘట్టం గురువారంతో ముగియనుంది. చివరి రోజు కావడంతో మరింత మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశమున్నట్లు అధికారులు వెల్లడించారు. 26వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నట్లు వివరించారు.



నగరి ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోజా



నామినేషన్ వేస్తున్న బీఎస్పీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి విజయకుమార్

నేడు విశ్వంలో పాలిసెట్ ఉచిత మోడల్ టెస్ట్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో గురువారం ఉదయం 10గంటలకు పాలిసెట్ మోడల్ టెస్ట్‌ను ఉచితంగా నిర్వహించనున్నట్లు విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న నిర్వహించనున్న పాలిసెట్‌కు అనుగుణంగా నమూనా పరీక్షను నిర్వహించనున్నామని, తద్వారా విద్యార్థులు వెనుకబడ్డ అంశాలను గుర్తించి, అసలైన పరీక్షలో రాణించేందుకు దోహదమవుతుందని పేర్కొన్నారు. ఈ నమూనా పరీక్షకు విద్యార్థులు హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించ వచ్చని ఆయన కోరారు.

30 వరకు ఇంటర్ ఫీజు చెల్లింపులకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ ఫీజు చెల్లింపులకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.

జిల్లా స్టోర్‌కు ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్‌కు రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని ఎస్ఈ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. 160 ట్రాన్స్‌ఫార్మర్లు(25 కేవీ సామర్థ్యం) వచ్చాయన్నారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరీయల్ డ్రా చేసుకోవాలని వివరించారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఉద్యోగుల జేఏసీ చైర్మన్, ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ పోస్టల్‌బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు చివరి తేదీ అని చెప్పారు. జిల్లాలో ఎన్నికల విధులకు నియమితులైన అన్ని శాఖల ఉద్యోగులు తప్పనిసరిగా చివరి తేదీ లోపు ఆర్‌ఓలకు పోస్టల్‌బ్యాలెట్‌ను అందజేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్‌ను వేయాలన్నారు. ఓపీఓలు తక్కువ మంది పోస్టల్‌బ్యాలెట్‌లు సమర్పించినట్లు సమాచారం ఉందన్నారు. పోలీస్, ఆర్టీసీ, ఇతర అత్యవసర సేవల్లో ఉన్న సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌలు.. ఎనలేని మేలు

అన్నదాతకు అన్నివిధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సాగును సంబరంగా తీర్చిదిద్దింది.. క్షేత్రస్థాయిలో ఆర్‌బీకేల ద్వారా చేయూతనందిస్తోంది. ఎరువులు.. విత్తనాలు.. పురుగుమందులను రాయితీపై పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలోనే కౌలు రైతులకు సైతం చిత్తశుద్ధితో తోడ్పాటునందిస్తోంది. భూ యజమానులతో సమానంగా సంక్షేమ పథకాలు అందిస్తోంది. ఆరుగాల కష్టానికి తగ్గట్టు ప్రతిఫలం పొందేలా చర్యలు చేపడుతోంది. అయితే కౌలు రైతుకు ప్రభుత్వం చేస్తున్న మేలును ఎల్లోమీడియా వక్రీకరిస్తోంది. రాజకీయ అజెండానే పరమావధిగా అసత్య కథనాలను ప్రచురిస్తోంది. తప్పుడు లెక్కలతో ఉద్దేశపూర్వకంగా బురదజల్లేందుకు విఫలయత్నం చేస్తోంది.

- వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం
- కౌలు రైతులకు పూర్తిస్థాయిలో సహకారం
- రైతు భరోసాతో పెట్టుబడి సాయం
- అవసరాల మేరకు బ్యాంకు రుణాలకు అవకాశం
- రాయితీపై ఎరువులు.. విత్తనాల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్ : వ్యవసాయానికి పెద్దపీట వేసిన ప్రస్తుత ప్రభుత్వం పంటల సాగులో రైతులకు అండగా నిలుస్తోంది. భూముల లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న కౌలుదార్లకు సైతం అన్ని విధాలా తోడుగా నిలుస్తోంది. అందులో భాగంగా జిల్లాలో మొత్తం 3,216 మంది కౌలు రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేసింది. వీటి ఆధారంగా సాధారణ రైతులతో సమానంగా అన్ని సంక్షేమ ఫలాలను పొందే అవకాశం కల్పించింది. ఏటా సాధారణ రైతులతో సమానంగా కౌలు రైతులకు కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం జమ చేస్తోంది. బ్యాంకు రుణాల కింద ప్రతి కౌలు రైతుకూ రూ.లక్ష వరకు వడ్డీలేకుండా అందజేస్తోంది, రాయితీపై విత్తనాలను సైతం అందించి ఆదుకుంటోంది. ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో కౌలు రైతులు ఆనందంగా పంటల సాగు చేసుకుంటున్నారు. అయితే ఎల్లో మీడియాకు ఇవేమీ కనిపించక పోగా, తప్పుడు లెక్కలు, రాతలతో అసత్య కథనాలను వండి వారుస్తోంది. బుధవారం ఈ క్రమంలోనే ఈనాడు దినపత్రికలో 'జగన్ తిలోదకౌలు' శీర్షికతో వాస్తవాలను వక్రీకరించి రైతులను తప్పుదోవ పట్టించేలా కథనం ప్రచురించింది.

బ్యాంకు రుణాలు ఇలా...

జిల్లాలోని కౌలు రైతులకు ప్రస్తుత ప్రభుత్వం ఎప్పటికప్పుడు బ్యాంకు రుణాలు అందేలా చర్యలు చేపడుతోంది. మొత్తం 3,216 మంది కౌలు రైతులకు గాను పంట రుణాల కోసం ముందుకు వచ్చిన ప్రతిఒక్కరికీ బ్యాంకుల ద్వారా రుణ సాయం అందించింది. అందులో 681 మంది కౌలు రైతులకు వ్యక్తిగత రుణం కింద రూ.9.88 కోట్లు పంపిణీ చేసింది. అలాగే 1,859 రైతు మిత్ర సంఘాల్లో సభ్యులుగా ఉన్న కౌలు రైతులకు కూడా రూ.59.98 కోట్ల బ్యాంకు రుణాలను మంజూరు చేసింది.

రాయితీ విత్తనాలు రెడీ!

ఏటా కౌలు రైతులకు రాయితీపై సాగుకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రాయితీపై అందిస్తోంది. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కౌలుదారుడూ విత్తనాలు పొందే వెసులుబాటు కల్పించింది. సాధారణ రైతులతో సమానంగా రాయితీపై వేరుశనగ, చిరుధాన్యాలు, వరి తదితర విత్తనాలను 80 శాతం రాయితీపై అందించి ఆదుకుంటోంది.



ఈనాడులో ప్రచురితమైన అసత్య కథనం



రైతుకు 'భరోసా'

ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగును ప్రోత్సహిస్తూ అన్నదాతలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ముందస్తుగా పెట్టుబడి నిధిని అందిస్తోంది. అదే తరహాలోనే కౌలు రైతుల్లో అర్హులైన 1,285 మందికి రూ.1,709 కోట్లు పంపిణీ చేసింది. ప్రభుత్వం అందించిన సహకారంతో కౌలు రైతులు ఆనందంగా పంటలను సాగు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ సహకారం



కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి సహకారం అందిస్తుండడంతో ఆనందంగా సాగు చేపడుతున్నాం. నేను ఒక ఎకరా కౌలుకు తీసుకుని టమాట, కూరగాయలు, తదితర పంటలను సాగు చేస్తున్నా. ఏటా ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతు భరోసా ద్వారా ముందస్తు పెట్టుబడి నిధిని అందించి ఆదుకుంది. దీంతో పంటల సాగుకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సిన అవసరం తప్పింది.

– కె.చంద్ర, చౌడేపల్లె మండలం

సకాలంలో సంక్షేమ ఫలాలు



కౌలు రైతుగా ప్రభుత్వం అందించిన గుర్తింపు కార్డుతో సకాలంలో సంక్షేమ ఫలాలను పొందుతున్నాం. నేను ఎకరా కౌలుకు తీసుకుని వివిధ రకాల పంటలు చేస్తున్నా. గుర్తింపు కార్డు ఆధారంగా సాధారణ రైతులతో సమానంగా ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలను పొందుతున్నా. కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం ఎప్పటికీ మరువలేం.

– పి.గుణశేఖర్, పెనుమూరు మండలం

ఈ ప్రభుత్వమే సాయం చేసింది



నేను 2.5 ఎకరాలు భూమిని కౌలుకు తీసుకొని సాగుచేసుకుంటున్నా. గతంలో ఏ ప్రభుత్వమూ మమ్మల్ని పట్టించుకోలేదు. ఎలాంటి పథకాలు అందించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మాకు గుర్తింపు వచ్చింది. అందరితో సమానంగా సాయం చేసింది. రైతు భరోసా పథకం కింద పెట్టుబడికి మూడేళ్ల నుంచి ఏటా రూ.13,500 చొప్పున అందజేసింది. కౌలు రైతు కార్డు ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించింది. బ్యాంకు రుణాలు సైతం మంజూరు చేసింది. అయితే అవసరం రాక నేనే తీసుకోలేదు.

– ప్రకాష్, ముడిపల్లి, నగరి మండలం

మరువలేని సహకారం



నేను రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నా. పంటలు సాగు చేసుకునేందుకు గతంలో చాలా ఇబ్బంది పడేవాడిని. ఏ సీజన్‌లో ఎలాంటి పంట వేస్తే లాభదాయకమో తెలియక నానా అవస్థలు ఎదుర్కొనేవాడిని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం వచ్చిన తర్వాత చాలా వెసులుబాటు వచ్చింది. ఆర్‌బీకే సిబ్బంది మా పొలానికి వచ్చి ఎప్పుడు ఏ పంట వేసుకోవాలో సూచిస్తున్నారు. అలాగే ప్రభుత్వం సైతం రైతు భరోసా డబ్బులతోపాటు రుణాలు కూడా ఇవ్వడంతో సాగు సులభతరంగా మారిపోయింది.

– నారాయణస్వామి, కెంప సముద్రం, రామకుప్పం మండలం

రుణపడి ఉంటా



నాకు సెంటు భూమి లేదు. అయినా మరో రైతు నుంచి 8 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. ఫలితంగా ప్రభుత్వం రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి కింద సాయం అందించింది. పంట సాగుదారు హక్కు పత్రం సైతం అందజేసింది. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు తీసుకున్నా. ఉచిత పంట బీమా సౌకర్యం కల్పించింది. మాలాంటి కౌలు రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటా.

– ఏ.ఉమాపతి, వేపగుంట, పుత్తూరు మండలం

ఆనందంగా ఉంది



ప్రభుత్వం కౌలు రైతలుకు సైతం రైతు భరోసా పథకం అమలు చేయడం చాలా ఆనందంగా ఉంది. గతంలో వ్యవసాయానికి పెట్టుబడి కోసం అప్పులు చేసేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇటు రైతు భరోసా ఇవ్వడంతో పాటు సీసీఆర్ కార్డు ద్వారా ఏటా రూ.85 వేలు బ్యాంకు రుణం కూడా పొందుతున్నా. రైతు భరోసా కింద ఇప్పటి వరకు రూ.61 వేలు వచ్చింది. కౌలు రైతలు కోసం ఆలోచన చేసి ఆర్థిక సాయం , రుణాలు, పంట నష్టం సైతం ప్రభుత్వం అందిస్తోంది. దీంతో పెట్టుబడి కోసం ఇబ్బందులు, అప్పులు తప్పాయి.

– రామ్‌కుమార్, బెల్లంగోవిందపల్లె, ఐరాల మండలం

క్లుప్తంగా

రూ.94,500 నగదు సీజ్



చెక్‌పోస్టు వద్ద నగదును పరిశీలిస్తున్న అధికారులు

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు చెక్‌పోస్టులో బుధవారం చేపట్టిన వాహనాల తనిఖీలో భాగంగా రశీదులు లేకుండా తీసుకెళతున్న రూ.94,500 సీజ్ చేసినట్లు ఎస్‌ఎస్‌టీ టీమ్ లీడర్ గణపతి తెలిపారు. తమిళనాడులోని వగినేకల్ నుంచి అనంతపురం జిల్లాకు వెళుతున్న ఐషర్ వాహనంలో నగదు పట్టుబడినట్టు వెల్లడించారు. తనిఖీల్లో ఏఆర్ ఎస్‌ఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీహరి, కానిస్టేబుల్స్ గోపి, మునిరత్నం, రాజశేఖర్ పాల్గొన్నారు.

కారు బోల్తా

– దంపతులకు స్వల్పగాయాలు

చంద్రగిరి: కారు బోల్తాపడి దంపతులు స్వల్పగాయాలతో బయటపడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి అగరాల సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతిలోని ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ శిరీష మంగళవారం తన భర్త సుబ్రమణ్యంతో కలసి కారులో తిరువణ్ణామలైకు వెళ్లారు. బుధవారం ఉదయం తిరుగు ప్రయాణంలో అగరాల వద్ద వస్తున్న క్రమంలో కారు నడుపుతున్న సుబ్రమణ్యం నిద్రలోకి జారుకున్నాడు. దీంతో కారు రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి వెళ్లి పల్టీలు కొట్టుకుంటూ పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో దంపతులిద్దరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సర్కారు బడి.. చదువులమ్మ ఒడి

- తిరుపతి జిల్లాలోని ఎర్రావారిపాళెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 261 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాశారు. ఇందులో 256 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి డివిజన్‌లో 211 మంది, రెండో డివిజన్‌లో 38, మూడవ డివిజన్‌లో ఏడుగురు ఉత్తమ మార్కులు సాధించారు. ఈ మండలంలో గత ఏడాది 74.57 శాతం ఫలితాలు రాగా, ప్రస్తుతం 98.08 శాతం ఫలితాలు వచ్చాయి.
- చిత్తూరు జిల్లాలోని ఎస్‌ఆర్‌పురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది పరీక్షల్లో రాణించారు. ఈ మండలంలోని ప్రభుత్వ బడుల నుంచి 327 మంది పరీక్షలకు హాజరయ్యారు. 324 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో మొదటి డివిజన్‌లో 311 మంది, రెండో డివిజన్‌లో 9 మంది, రెండో డివిజన్‌లో నలుగురు ఉత్తమ మార్కులు సాధించారు. ఈ మండలంలో 99.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు
- నూతన సంస్కరణలతో ఉత్తమ ఫలితాలు
- కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థుల ప్రతిభ
- తిరుపతి జిల్లాలో 9,752 మందికి ఫస్ట్ క్లాస్
- చిత్తూరు జిల్లాలో 15,465 మందికి ప్రథమశ్రేణి



588 మార్కులు సాధించిన కార్వేటినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి, తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు బడుల్లో విద్యార్థుల ప్రతిభ పదోతరగతి పరీక్షల్లో నిరూపితమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన విప్లవాత్మకమైన సంస్కరణలు ఉత్తమ ఫలితాలకు దోహదం చేశాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానా కారణంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సత్ఫలితాలు వచ్చాయి. రెండు జిల్లాల్లో నమోదైన ఫలితాలు విద్యార్థుల సమర్థతకు అద్దం పడుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ బడుల్లో చదువుతున్న విద్యార్థులకంటే సర్కారు బడుల్లో చదివిన వారు చక్కటి మార్కులు సాధించారు.

ప్రైవేట్‌కు దీటుగా..

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల పిలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించారు. జిల్లాలోని 31 మండలాల్లో ఎస్‌ఆర్‌పురం మండలంలో అత్యధికంగా 99.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆ తర్వాత గుడుపల్లె మండలంలో 99 శాతం, పూతలపట్టులో 98.86, తవణంపల్లె 98.79, రామకుప్పంలో 98.30 శాతం ఉత్తీర్ణులయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటి డివిజన్‌లో 15,465 మంది పాస్ అయ్యారు. చిత్తూరు మండలంలో అత్యధికంగా 2,459 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ సాధించడం విశేషం.

ఎర్రావారిపాళెంలో అత్యధిక ఉత్తీర్ణత

తిరుపతి జిల్లాలోని 34 మండలాలకు గాను ఎర్రావారి పాళెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణతను సాధించారు. ఆ మండలంలో 98.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే నాగలాపురంలో 95.45, కేవీబీపురంలో 95.09, దక్కిలి లో 93.15, సత్యవేడులో 92.64, పిచ్చాటూరులో 92.06, రామచంద్రాపురంలో 91.64, బీఎన్ కండ్రిగలో 90.36 శాతం ఫలితాలు నమోదయ్యాయి. తిరుపతి అర్బన్‌లో అత్యధికంగా మొదటి డివిజన్‌లో 1,003 మంది పాస్ అయ్యారు.



పిచ్చాటూరు మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని జ్యోత్స్నకు స్వీట్ తినిపిస్తున్న ఎంఈఓ

పథకాలతో ప్రోత్సాహం

అమ్మ ఒడి, విద్యాకానుక, నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, ట్యాబ్‌ల పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలతో సర్కారు బడుల్లోని విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించింది. పిల్లలను బడికి పంపుతున్న తల్లుల ఖాతాల్లో ఏటా తప్పకుండా అమ్మ ఒడి నగదు జమ చేసింది. నాడు–నేడు పేరుతో పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. ఇంగ్లిష్ మీడియంతో పాఠ్యాంశాల బోధనను అందుబాటులోకి తీసుకువచ్చింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా బోధనా విధానాలను అమలు చేసింది.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ఆర్‌టీసీ, వివిధ శాఖల ఉద్యోగులు, అత్యవసరసేవల సిబ్బంది, విభిన్నప్రతిభావంతులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే పీఓ, ఏపీఓలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికీ ఫారమ్–12 పంపిణీ చేసినట్లు చెప్పారు. మే 5వ తేదీన ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్‌లను శిక్షణలు పొందే ఆర్‌ఓ కేంద్రాల్లో సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులకు ఇతర జిల్లాలో ఓటు ఉంటే ఫారమ్–12 సేకరించి ఆయా జిల్లాలకు పంపుతామని వివరించారు. ఈ నెల 29 వ తేదీకి కొత్త ఓటర్ల కు సంబంధించిన ఆరు వేల గుర్తింపు కార్డులు జిల్లాకు రానున్నట్లు తెలిపారు.

1 నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ఓటరు స్లిప్పులను మే 1వ తేదీ నుంచి ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మే 6వ తేదీ నాటికి ఓటర్‌స్లిప్పుల పంపిణీ పూర్తి చేయనున్నట్లు వివరించారు. 9 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, ఎన్నికల సిబ్బంది ఉమాపతి, వివిధ పార్టీల ప్రతినిధులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, పరదేశి, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

'ఆరణి' అఫిడవిట్ నమ్మడానికేనా?



చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో రూ.94 లక్షలుగా చెబుతున్న ఆరణి శ్రీనివాసులు నివాసం

- కన్న కొడుకుల ఊసే ఎత్తని శ్రీనివాసులు
- పైగా ఆస్తుల విలువ తగ్గించి చూపిన వైనం
- గత ఎన్నికల అఫిడవిట్‌కు భారీ వ్యత్యాసం
- ఎన్నికల సంఘాన్ని ఏమార్చడమే లక్ష్యమా?

ఆస్తుల వివరాలు

పేరు	-	ఆరణి శ్రీనివాసులు
పార్టీ	-	జనసేన
విద్యార్హత	-	డిగ్రీ ఫెయిల్
చరాస్తి	-	రూ.20.51 కోట్లు
స్థిరాస్తి	-	రూ.61.41 కోట్లు
బంగారం, వెండి	-	3.350 కిలోలు
డైమండ్ ఆభరణాలు	-	167 గ్రాములు
ప్లాటినం ఆభరణాలు	-	101 గ్రాములు
అప్పులు	-	రూ.82.66 లక్షలు

చిత్తూరు అర్బన్/ చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు ఎమ్మెల్యే, ప్రస్తుత తిరుపతి అసెంబ్లీ జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారా..? ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించిన అంశాల్లో ఉద్దేశపూర్వకంగా పలు విషయాలను దాచి ఉంచారా..? ఐదేళ్ల క్రితం ఉన్న ఆస్తుల్లో కొన్నింటిని ఇపుడు చూపించలేదా..? నాటి ఆస్తుల విలువ ఇపుడు ఏమాత్రం పెరగలేదా..? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఇది ఉద్దేశపూర్వకంగా ఎన్నికల సంఘాన్ని తప్పుదారి పట్టించడమేనని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరణి ఇచ్చిన అఫిడవిట్‌లో ప్రస్తావించిన పలు విషయాలు, ప్రస్తావించని అంశాలు పరిశీలిస్తే..

ఈసీని బురిడీ కొట్టించి

చిత్తూరుతో పోలిస్తే ఆరణి శ్రీనివాసులుకు కర్ణాటకలోనే ఆస్తులు ఎక్కువ. కర్ణాటకలోని కొడిహల్లిలో సర్వే.నం.7/3లో 89 సెంట్ల భూమి ఉన్నట్లు చూపించిన ఇతను 2019లో ఇచ్చిన ఎన్నికల అఫిడవిట్‌లో దాని విలువ రూ.4.09 కోట్లుగా చూపించాడు. కానీ ఇపుడు ఇచ్చిన అఫిడవిట్‌లో సైతం రూ.4.09 కోట్లుగానే చూపించడం ఈసీ చెవులో పువ్వులు పెట్టడమే. ఇక కన్నమంగళంలోని సర్వే.నం 162/03లో 6281 చ.అ స్థలం ఉన్నట్లు చూపించి, 2019లో దాని విలువ రూ.1.88 కోట్లుగా పేర్కొన్నారు. ఇపుడు కూడా దాని విలువ మారనట్లు అఫిడవిట్లో చూపించారు. చిత్తూరు నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలో 3,960 చ.అ స్థలం, బంగ్లాను తలపించే ఆరణి నివాసం 2019లో రూ.40 లక్షలుగా, ఇపుడు రూ.94 లక్షలుగా చూపించారు. ప్రస్తుతం ఈ ఆస్తి మార్కెట్‌లో రూ.4 కోట్లకు పైగా పలుకుతోంది. అలాగే తిరుచానూరులోని సర్వే.నం -256/4లో 72 సెంట్ల భూమిని చూపించిన ఆరణి.. 2019లో దాని విలువ రూ.2.38 కోట్లుగా చూపించి, ఇపుడు రూ.1.50 కోట్లుగా చూపించారు. ప్రస్తుతం ఈ భూమి మార్కెట్ విలువ రూ.6 కోట్ల వరకు ఉంటుంది. ఇక తిరుపతి నగరంలోని దామినేడులోని సర్వే.నం 212–16ఏ 6.95 ఎకరాల భూమి విలువ 2019లో రూ.8.34 కోట్లు చూపిస్తే, ఇపుడు రూ.13.90 కోట్లుగా చూపించారు.

ప్రస్తావించని ఆస్తులు..

2019లో ఆరణి ఇచ్చిన అఫిడవిట్‌లో తనకు ఇద్దరు కుమారులున్నట్లు చూపించి, ఇపుడు వాళ్ల ఊసే ఎత్తలేదు. మరోవైపు చిత్తూరు నగరంలోని రామ్‌నగర్ కాలనీలోని 3,400 చ.అ ఉన్న ఐదు అంతస్తుల భవనం, చిత్తూరు ఉషానగర్ కాలనీలోని 14,400 చ.అ విస్తీర్ణం ఉన్న నాన్–అగ్రికల్చర్ భూములు, హైదరాబాద్ అమీర్‌పేటలో ఉన్న 7,100 చ.అ భవనం, చిత్తూరు ఇరువారంలో ఉన్న సర్వే.నం-250లోని 45 వేల అడుగుల వాణిజ్య స్థలం, అందులో నిర్మించిన 5 వేల అడుగుల కట్టడంపై ఎలాంటి ప్రస్తావన చేయలేదు. దీన్ని కావాలనే అఫిడవిట్‌లో దాచి ఉంచారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అఫిడవిట్ సమాచారం



అభ్యర్థి	:	కృష్ణ రాఘవ జయేంద్ర భరత్
అసెంబ్లీ నియోజకవర్గం	:	కుప్పం
స్థిర,చరాస్తులు	:	రూ.1.20 కోట్లు
చేతిలో ఉన్న నగదు	:	రూ.2లక్షలు
బ్యాంకు బాలెన్స్	:	రూ.1,86,092
డిపాజిట్‌లు, ఇన్సూరెన్స్‌లు	:	రూ.57,48,564
బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్	:	రూ.5,84,526
కారు	:	రూ.24.68 లక్షలు
బంగారం	:	100 గ్రాములు (రూ.6.60లక్షలు)
అప్పులు	:	రూ.11,67,032
భార్య దుర్గా పద్మిణి స్థిర, చరాస్తులు	:	రూ.41.80 లక్షలు
నగదు	:	రూ. 2 లక్షలు
బ్యాంకు బ్యాలెన్స్	:	రూ.28, 866
బంగారం	:	600 గ్రాములు (రూ. 30.60 లక్షలు)

120 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

ఐరాల: మండలంలోని 120 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను బుధవారం ఆయా సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నేతల వేధింపులు, అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా విశేష సేవలు అందిస్తున్న వలంటీర్లను రాజకీయ లబ్ధి కోసం కించపరచడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ప్రజాప్రభుత్వానికి మద్దతుగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

బలవంతంగా టీడీపీ కండువా కప్పారు



వేసిన వెంటనే టీడీపీ కండువా తొలగిస్తున్న దీపురెడ్డి



మంత్రి రోజా సమక్షంలో కండువా వేసుకుంటున్న దీపురెడ్డి

పుత్తూరు: ప్రచారంలో భాగంగా మా ఇంటి వద్దకు వచ్చిన టీడీపీ అభ్యర్థి గాలిభానుప్రకాష్ బలవంతంగా మెడలో కండువా కప్పారని వడమాలపేట మండలం తిరుమణ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువనేత సిద్ధ దీపురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం ప్రచారం నిమిత్తం గ్రామానికి వచ్చిన టీడీపీ నాయకులు తాము వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులమని తెలిసి, బలవంతంగా మెడలో కండువా కప్పారని స్పష్టం చేశారు. తాను టీడీపీలో చేరాలనుకుంటే వారి వద్దకు వెళ్లాలి కాదా? మా ఇంటి వద్ద కండువా కప్పారంటే.. ఇది చిల్లర రాజకీయాలను తలపిస్తోందన్నారు. ఈ తంతు పలుచోట్ల జరుగుతున్నట్లు చెప్పారు. తాము వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులమే అని చాటుకునేందుకు అదేరోజు రాత్రి ఎస్వీపురంలో పర్యటిస్తున్న మంత్రి ఆర్కే రోజా వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి, యాదవేంద్రరెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన ముస్లిం నేతలతో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ

వి.కోట : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిపోతున్నారు. బుధవారం అందులో భాగంగా మండలంలోని నెర్నిపల్లె పంచాయతీ పైపల్లెకు చెందిన ఆది, బాలు, కుమార్, అశ్వత్ నారాయణ, సోము, మిట్టూరు గ్రామానికి చెందిన బీవీ మునిరత్నం, అరుణాచలం, నారాయణప్ప, శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరందరూ బుధవారం ఉదయమే టీడీపీలో చేరారు. గంటైనా గడవక ముందే వైఎస్సార్‌సీపీ గూటికి చేరుకోవడం విశేషం. వారు మాట్లాడుతూ టీడీపీలో కొంతసేపు కూడా ఇమడలేకపోయామని, జగనన్న అందించిన సంక్షేమ పథకాలు గుర్తుకు రావడంతో ఆగలేక వైఎస్సార్‌సీపీలోకి వచ్చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే వి.కోటకు చెందిన 25 మంది మైనారిటీలు టీడీపీ, కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ సాదర ఆహ్వానం పలికారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని దొడ్డిపల్లెకు చెందిన 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి, బీసీ నాయకుడు రావూరి ఈశ్వరరావు వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో దేవా, కుమార్, చిన్నబాబు, ఏసు, త్యాగరాజన్, మణి, ఏలుమలై, మాధవన్, కుప్పమ్మ, రంగా, చంద్రకళ, పరిమళ, లోకనాథం, బాస్‌బాలాజీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత, నాయకుడు శివకుమార్ పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో ఇందుమతి, రావూరి ఈశ్వర్‌రావు

భర్త అరెస్టు

వరదయ్యపాళెం: సాధనవారిపాళెంలో ఈ నెల 19న భార్య అంజలి (24)పై అనుమానంతో గొంతు నులిమి హతమార్చిన భర్త తూకివాకం రాజశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై బుధవారం స్థానిక వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. భార్యపై అనుమానంతో తరచూ భర్త రాజశేఖర్ గొడవ పడేవాడు. ఈ నెల 20న భార్య అంజలి ఫోన్‌లో మాట్లాడడాన్ని అనుమానించి గొడవకు దిగాడు. దీంతో బాత్రూంలో స్నానం చేస్తున్న భార్యపై దాడి చేసి గొంతు నులిమి హత్యకు పాల్పడ్డాడు. అయితే ఆమె కొన ఊపిరితో తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దర్యాప్తు చేస్తుండగా బుధవారం బీఎన్‌కండ్రిగ–సూళ్లూరుపేట రహదారి మార్గంలోని సాధనవారిపాళెం బస్టాప్ వద్ద నిరీక్షిస్తున్న భర్త రాజశేఖర్‌ను రహస్య సమాచారం మేరకు ఎస్ఐ ప్రతాప్, సిబ్బంది సహకారంతో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది.

5 ఎకరాల గడ్డివామి దగ్ధం

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు వ్యవసాయ పొలాల్లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో 5 ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్తుల కథనం మేరకు .. గ్రామానికి చెందిన సుబ్బరత్నమ్మ 5 ఎకరాల ఎండు గడ్డిని మోపులు కట్టి పొలంలో నిల్వ చేసుకుంది. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో ప్రమాదం జరిగింది. రూ.2 లక్షల నష్టం జరిగిందని బాధితురాలు తెలిపింది.